ఈనాడు
epaper.eenadu.net

# మూడు ప్రధాన ప్రాజెక్టులకు నిధులివ్వండి

**• కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి**



కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ఈనాడు, దిల్లీ:** హైదరాబాద్ నగర ముఖచిత్రాన్ని మార్చే మూడు ప్రధాన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులిచ్చి మద్దతుగా నిలవాలని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. నక్సల్ ప్రాబల్య రాష్ట్రాల సీఎంల సదస్సులో పాల్గొనడానికి దిల్లీకొచ్చిన రేవంత్.. సోమవారం ఇక్కడ కేంద్ర మంత్రిని కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు.

◆ ‘‘హైదరాబాద్ సమగ్ర మురుగునీటి పారుదల మాస్టర్‌ప్లాన్ (కాంప్రహెన్సివ్ సీవరేజ్ మాస్టర్‌ప్లాన్-సీఎస్ఎంపీ)ని అమృత్ 2.0 పథకంలో చేర్చండి. వీలుకాకపోతే ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టండి. నగర ప్రజల జీవనప్రమాణాలు ప్రపంచస్థాయిలో ఉండాలంటే నగరంతో పాటు సమీప మున్సిపాలిటీల నుంచి వెలువడే ద్రవ వ్యర్థాలను 100 శాతం శుద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు సమీప 27 పురపాలక సంఘాలను కలిపి 7,444 కి.మీ. మేర మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి రూ.17,212.69 కోట్లతో డీపీఆర్ రూపొందించాం. దీన్ని అమృత్ 2.0లో చేర్చి ఆర్థిక సాయం చేయాలి.

◆ హైదరాబాద్ నగరం గుండా ప్రవహించే మూసీ నదిలో మురుగు చేరకుండా ఉండేందుకు ప్రధాన మురుగు కాలువలు, కొత్త మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో రూపొందించిన డీపీఆర్‌ను ఆమోదించడంతో పాటు పనులకు అనుమతించాలి.

◆ హైదరాబాద్ మెట్రో రెండోదశ విస్తరణకు రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశాం. దీన్ని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం 50:50 నిష్పత్తిలో సంయుక్తంగా చేపట్టడానికి అనుమతివ్వాలి. త్వరలోనే ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను సమర్పిస్తాం. నగర అవసరాల దృష్ట్యా ఈ ప్రాజెక్టు త్వరగా కార్యరూపం దాల్చేందుకు సహకరించాలి’’ అని కేంద్ర మంత్రి ఖట్టర్‌ను రేవంత్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జి.వంశీకృష్ణ, దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

Date : 08/10/2024 EditionName : GREATER HYDERABAD PageNo :